# జోరుగా...హుషారుగా...

"మనుషులన్న వాళ్ళకు కాస్త వినోదం విశ్రాంతి అవసరం" అంది వినయలక్ష్మి.

"మరే!" పైపులోకి పొగాకు దట్టిస్తూ ఎం. ఎం. రావన్నది. అంగీకారసూచకమా, హేళన పూర్వకమా, అని తెలియక ఆయనకేసి చురచుర చూసింది వినయలక్ష్మి.

"అంటే ఏమిటి మీ ఉద్దేశం? మేము మనుషులం కామనా?"

"చూడు వినయా. మేము అన్నది మామూలుగా బహువచనం, రాజులువాళ్ళు ఏకవచనానికి మారుగా వాడుతుంటారు. ఇంతకూ నువ్వు... " అని లాజికల్ గా దాడి చేస్తుండగా వాళ్ళావిడ "మీరు తెలుగు పార్ట్ మూడుసార్లు కట్టి బి.ఎ. లాగించారు కదా. ఆ డిగ్రీ ఏం వచనంటా?" అని సైడ్– అటాక్ ఇచ్చింది.

ఉబ్బిన దవడలు బుసలు కొడుతుండగా , వచ్చిన ఉక్రోషమంతా బయటకు చూపలేనని తెలిసి పైపులోని పొగాకునంతా మళ్ళా కిందకు కొట్టారు ఎం. ఎం. రావ్. ఇటూ , అటూ చూశారు. పిల్లలు ఈ కామెంటు విన్నట్లులేదు. "లక్ష్మి, నేను బి.ఏ. మూడుసార్లు కట్టింది నిజమే. తెలుగు రెండోసారే పాసయ్యాను. ఇది జాగ్రత్తగా రాసి కంఠతాపట్టు. అంతేకాని నా ఎకడమిక్ రికార్డ్ అంతా తలకిందులుచేసి , నా ప్రెస్టేజిని డైరీ ఫారం పాలల్లా డైల్యూట్ చేయకు... ఓకే.." అని 'గర్జించి'నట్లు మాట్లాడి పైపును నోట్లో పెట్టుకున్నారు.

అంటే ఆ విషయంమీద ఆయన ఇంక మాట్లాడరు అని తెలుసు రావుగారితో 32ఏళ్ళ కాపురంచేసిన వినయలక్ష్మికి. అందుకని ఈసారి డైరెక్టుగా విషయంలోకి వచ్చింది.

"మనం ఏదన్నా సినిమాకు వెళ్లాలండీ..?" అంది. పాలకపార్టీ సభ్యుడే ప్రైవేటుబిల్లు ప్రవేశ పెడుతున్న ధోరణిలో ప్రతిపక్షం కళవళ పడుతూందని తెలిసిన ఎం.ఎం.రావు ఇందిరాగాంధీలా సైలెంటయిపోయారు.

"సినిమా అన్న మూడక్షరాలు తారకమంత్రంలా వీనుల సోకి అరుణజ్యోతి (16

వసంతాలు. ఇంటర్ ఆర్ట్స్ మొదటేడు) ఛెంగున గెంతుకొచ్చింది. నిముషంలో సీనంతటినీ ఔపాసన పట్టేసింది. "ఆ పైపీలా ఇవ్వండి నాన్నగారూ. నేను కడుక్కొచ్చి ఇస్తాను.. అగ్గిపెట్టె దగ్గరుందా ? తేవాలా?".

"వద్దమ్మా... నేను కడిగేశాను. అగ్గిపెట్టె వుంది.." రావుగారు ప్రహ్లాదుని చూచిన నారసింహుడిలా చందనం ముద్ద అయిపోవడం గమనించిన వినయలక్ష్మి అస్సలు ఈ కాలం పిల్లలమ్మో. ఎంతటి కార్యసాధకులు. అని కూతురిని మనసులో మెచ్చుకుంది..

"నాన్నా..సింహాచలం , వెళ్దాం నాన్నా". గోముగా కూతురడిగినదానికి అయన..." ఏదన్నా మొక్కుకున్నావామ్మా?" అని అడిగారు.

"కాదు నాన్నా...మా కాలేజిపక్కన కట్టారు 'సింహాచలం' 'భద్రాచలం' అని ట్విన్ థియేటర్స్.. అందులో ఎప్పుడూ మంచి మూవీసుంటాయి. 'సింహాచలంలో ఇప్పుడు 'సూపర్మేనుంది' నాన్నా...వెళ్దామా?" ఆయన జవాబు చెప్పేలోగా తెరలో కలకలం బయలుదేరింది.

"నాన్నగారూ. మనందరం కలిసి సినిమాకెళ్ళి.."

"చాలాకాలమయినది. అందువలన మనం.."

"ఒకే కుటుంబం అన్న ఫీలింగే మాయమయి.."

"పోతూంది కనుక వెంటనే మనం"

"అందరం."

"కలిసి ఒక"

"చక్కటి ఫిల్ముకు.

"వెళ్ళి తీరాలి" అని చెరిసగం వాక్యం చెప్పిన జంటకవుల్లా మంచి అవగాహనతో, సైన్మాయిక స్పృహతో పలుకుతూ వచ్చి కిటికీలో ఒకరు, నాన్నగారి కాళ్ళదగ్గర ఒకరూ కూర్చున్న వారు– జ్యేష్ఠపుత్రుడు సుందరరావ్ (ఇంజనీరింగ్ ఆఖరి ఏడు), ద్వితీయ మరియు కనిష్ఠ పుత్రుడు (బి.కాం. రెండో ఏడు) రఘుకిశోర్.

పైపు వెలిగించారు. ఎం.ఎం.రావ్ గారు. భారీకాయం కావడం మూలాన్న ఆఫీసులో ఆయన్ని '70 ఎం.ఎం.' అని కూడా రిఫర్ చేస్తుంటారు. అది విని ఆయన నవ్వి "ఆలిండియాలో మొదటి 70 ఎం.ఎం. వెండితెర నాదేనర్రా" అని నవ్వేస్తుంటారు. ఆ శరీరం మీది మెడనిటు అటు తిప్పి అసెంబ్లీని పరికించారు.

"ఔనండీ.. మనింటి దగ్గరే పద్మా టాకీసులో 'సహస్రశిరచ్ఛేద అపూర్వ చింతామణి' ఆడుతోంది. ..పోదామండీ" అన్న వినయలక్ష్మి సూచనకు.

"ఛీ: ఛీ:"

"బాబోయ్."

"వాటె టేస్ట్" అని వరుసగా ముగ్గురు పిల్లల వ్యాఖ్యలు.

పకపక నవ్వారు రావు.

"ఏవిటా నవ్వు.. బియ్యే తెలుగులో ఫస్టుక్లాస్ వచ్చినవాడిలా" – అంది వినయలక్ష్మి.

"ఊ లక్ష్మి.. సభవారు చర్చిస్తున్న అంశం సినిమా .. అంతేకాని మీ అన్నయ్య ఫెయిలయిన డిగ్రీ కాదు".

"హయ్యోరామ మా అన్నయ్య అసలు కాలేజికీ వెళ్ళ...."

"అమ్మాయిగారు అద్దానికి అంకితమయితే....

మీరిద్దరూ కలిసి సినిమా విషయం దాటవేస్తున్నారు" సుందరం హెచ్చరిక.

"నాన్నగారు ఇంటర్వెల్‌లో రెండేసి కోన్‌ఐస్క్రీములు కొనిపెడతారట." జ్యోతి సూచన.

"అసలయిస్క్రీమ్ నా ఒంటికి పడదమ్మాయ్. రెండు తింటే జ్వరం రావడం ఖాయం." అప్పుడే ఆ హాల్లోకి వచ్చిన ఆ ఇంటి స్త్రీ, పురాణ మహిళ. ఎం.ఎం. రావుగారి తల్లి నర్సాయమ్మ నిర్ధారణగా చెప్పింది.

"ఔన్నాన్నా! అందుకనే ఐస్క్రీములు వద్దు..సినిమా అయ్యాక రాజ్‌దూత్‌లో భోజనం...."సుందరం ప్రత్యామ్నాయం.

"అబ్బబ్బ..మెయినయిటమ్ సినిమా. అది తేలకుండా అత్యల్ప విషయాలమీద కొట్టుకుంటారేమిటి నాయకుల్లాగా!" రఘుకిశోరుడి పత్రికా సంపాదకీయంలాటి విసుగు.

"అవును అది ముందు తేల్చాలి" అంది వినయలక్ష్మి.

"అమితాబ్బచ్చన్ సినిమాచూసి ఎన్నాళ్ళయిందో..." సుందరం నొచ్చుకుంటుండగా. 'ట్రావోల్టా మూవీలు రావడమేలేదు' అని జ్యోతి కొరతపడింది. "ధర్మేంద్ర వేసిన 'షాలిమార్'కు వెళ్దాం నాన్నా". రఘు ముచ్చటపడ్డాడు.

"ధర్మేంద్ర అంటే ఆ జయమాలినిని సెకండ్ వైఫ్‌గా చేసుకున్నాడు వాడేనా?" అని శౌనకునిలా అడిగిన ఎం.ఎం. రావుగారి 'అజ్ఞానానికి ' పిల్లలందరు అవమానం, ఆశ్చర్యం, ఆగ్రహం పడిపోయారు. .."ఏవిటి నాన్నా"... నువ్వు ..ధర్మేంద్ర పెళ్ళాడింది హేమమాలినిని. వాళ్ళకే అమ్మాయికూడా పుట్టింది. ఆ అమ్మాయి పుట్టినప్పుడు బరువు62 గ్రాములుంది..." అంటూ ఏకరువుపెట్టింది జ్యోతి.

"మాతల్లే...ఇంటర్ రెండోఏట సినిమా పేపరొకటి ఇస్తే ఆలిండియా రేంక్ ఖాయం నీకు" అన్నాడు రఘు.

"నీ గది గోడలనిండా రేఖ, జీనత్ అమన్‌ల బొమ్మలు అతికించి వున్నాయి."

"ష్! నాన్నగారూ! మీరేం మాట్లాడడంలేదు." అన్నాడు సుందరం...

"ఒరేయ్ అబ్బీ! 'భక్తతుకారాం'వస్తే చూపించరా" అంది ఎం.ఎం.రావుగారి అమ్మ.

"అలాగేనమ్మా.. వచ్చినప్పుడు తీసుకువెళ్దాం." అని చాతక పక్షులకేసి తిరిగి గొంతు సవరించుకున్నారు. తృప్తిగా ఒకసారి పొగపీల్చి వదిలారు.

తహతహలాడి పోతున్నారు శ్రోతలు.

"మనందరం కలిసి ఒక సినిమాకు వెళ్లాలి. ఔనా?".

"ఔను ఔను.."అని సభలో కేకలు.

"ఒకే ఒకే వెళ్దాం. ట్రావెల్టా, ఎస్. వరలక్ష్మి. అమితాబ్బచ్చన్. ధర్మేంద్ర. ఏ ఎన్నార్ కలిసి నటించిన చిత్రం ఏదీలేదు గనుక మీ అందరి అభిరుచుల హీరోలు, హీరోయిన్లు కలిసిన ఒక సినిమాను చూడలేము. అంచేత ఎడ్వార్డ్ డీబోనో చెప్పినట్లు

కొంచెం లేటరల్ థింకింగ్ అవసరం మా అమ్మకు 'శిరచ్ఛేదం' కావాలి. జ్యోతికి అది నచ్చదు. దానికి ట్రవోల్టా కావాలి. సుందరానికి వాడు పడడు. సుందరానికి బ్రూస్‌లీ ఇష్టం కాని రఘుకు ధర్మేంద్ర చాలా అవసరం. కాని అందరం కలిసి వెళ్ళగలిగిన సినిమాకు వెళ్ళాలి."

...–నాన్నగారికి ఆఫీసులో ఎంతటి చిక్కు సమస్యనన్నా ఇట్టే విడదీయగలరన్న పేరెలా వచ్చిందో పిల్లల కర్థం అవుతోంది. "కొన్ని ప్రశ్నలకు ఔను, కాదు అని ఈ రెండు కోణాలనుంచి ఎంతచూచినా జవాబు దొరకదు. కనుక. ఈ 'ఔను" "కాదు" చట్రంనుండి బయటపడితే మనకు జవాబు దొరుకుతుంది. మీలో ప్రతి ఒకరు అభిమానించేవారు లేకపోయినా ఫరవాలేదు కాని అ బొత్తిగా ఇష్టంలేని జిడ్డు పీపా మొహం లేకుండా వుండాలి. ఔనా?".

తలలూగాయి.

"వీళ్ళెవరూ లేనిది , అందరూ సరికొత్తవారే నటించినదీ అయితే మీకెవరికీ అభ్యంతరం వుండకూడదు".

"అలాగే..."

"చాలా బాగుందని, మంచి పాటలున్నవాయని సమీక్షలు వచ్చిన 'శంకరాభరణం సినిమాకు రేపు శనివారం అరుగంటలకు వెళ్దాం." అని ముగించి పైపు దమ్ములు వరుసపెట్టి గుప్పుగుప్పున లాగించారు. ' ,

రాజీ సూత్రం కింద పిల్లలు, పాటలు బాగున్నాయనీ ఎదురింటి పార్వతమ్మగారు చెప్పారని వినయలక్ష్మి ఒప్పుకున్నారు.

రావుగారాఫీసునుంచి ప్యూను వెంకయ్యను నాలుగ్గంటలకే పంపి రిజర్వేషన్ చేయించాలి.

అబ్బాయిలిద్దరూ కాలేజీలనుండీ శ్రీరమణ హాలుకే తిన్నగా వస్తారు.

జ్యోతి మధ్యాహ్నం కాలేజీనుండి ఇంటికి వస్తుంది. అమే వాళ్ళమ్మా ఆటో రిక్షా మీద థియేటర్‌కు వస్తారు. రావుగారు ఆఫీసులో మంత్లీ మీటింగు ముగించుకొని రావాలి.

అందరూ ఐదుంముప్పావుకు థియేటర్ ప్రాంగణంలో వుండి తీరాలి.

"రేపు శనివారం దోశెలు పోస్తానని పప్పు నానబోస్తివి కదనే–" అంది రావుగారి అమ్మ.

"పోసే వెళ్తానులెండి"

రావుగారు సీజన్డ్ శాస్త్రి అవడం మూలాన ఈ మైల్డ్ కోల్డ్ వార్‌లో తటస్థంగా వుండిపోయారు.

* * *

ఆఫీసుకు వెళ్ళగానే అసిస్టెంటు లేబర్ కమీషనరుగారి సమక్షంలో కార్మిక నాయకులతో చర్చలు జరుపవలసిన కేసొకటి తగులుకుంది ఎమ్మెమ్ రావుకు. ఎం.డి గారికి అసలు ఇలాంటి వంటేనే ఎలర్జీ. పొద్దున కనబడ్డప్పటినుంచి ఏ.ఎల్.సి దగ్గరకు వెళ్ళిపో, వెళ్ళిపో అని ఎమ్మెమ్‌ను తరిమికొట్టినంత పనిచేశాడు. అది ముగించి వెనక్కొచ్చేసరికి రెండయింది. ఇంత కాఫీ నీళ్ళు, తాగి మధ్యాహ్నం మంత్లీ మీటింగ్‌కు

తయారవుతుండగా ఫోనొచ్చింది ఎమ్మెమ్‌రావుగారికి.

"ఏమండీ , వెంకయ్యను పంపారా?"

"ఎవరది వినయనా? ఏమిటి విశేషం... ఎన్నడూ లేనిది ఈ ఫోనులవిందు?"

"మీకు తెలుగు అలంకారాలు బాగా వచ్చునని అత్తగారు చెప్తుంది."

"ఇదిగో వినయా, టెలిఫోన్‌లో కూడా నా తెలుగు మీద...."

"సరేసరె..వెంకయ్యను..."

"వెంకయ్యా? ఎవరూ వెంకయ్యా?"

"ఇంకెవరండీ ...మీ మేనత్తకొడుకు స్టేట్స్‌లో డాక్టరుగావుంటూ నిన్ననే వచ్చాడు."

"అరె...నిన్న వస్తే నాకు వెంటనే ఎవరూ చెప్పలేదేం?"

"ఏవండోయ్" వినయలక్ష్మి స్వరం సీరియస్‌గా మారింది. " ఏ జోక్‌కయినా హద్దుండాలి. మీ ఆఫీసు ప్యూను వెంకయ్యను సినిమా టిక్కెట్లకు పంపిస్తానన్నారు. ఇంకా పంప లేదా?".

"మైగాడ్. ఇదుగో ఇప్పుడే పంపించేస్తాను. అని ఫోన్ కట్టేసి కోర్టు డఫేదారులా "వెంకయ్యా, వెన్‌కయ్యా - వెన్‌కయ్యో.." అని ముమ్మారు అరిచాడు ఎమ్మెమ్‌రావు.

రామానుజం, ఎల్‌డిసి, వచ్చాడు. "వెంకయ్య లేదు సార్".

"పొద్దున చూశానే"

"పొద్దున వచ్చాడు సార్. కాని ఇప్పుడెవరో వాళ్ళ బంధువులు పోయారని సగం రోజు సి.ఎల్. పెట్టి వెళ్ళాడు సార్"

"చచ్చానురా దేవుడా!" అని గడ్డం గోక్కున్నారు ఎమ్మెమ్. టై ముడి సరిచేసుకున్నారు. లేచి నిల్చుని బెల్టుతో సహా పంట్లాంని పైకి లాక్కున్నారు.

"చెప్పండి సార్. నేనేదయినా చేయాలంటే చెప్పండి."

ఒక నిముషం ఆలోచించారు. విషయమంతా రామానుజానికి చెప్పారు. 'అంత కన్నానా.. ఈ మాత్రం చేయలేకపోతే ఈ వెధవ శరీరం ఎందుకు'. వగైరా కాకా డైలాగులు చెప్పేసి చకచక నాల్గుగంటలకల్లా దస్తావేజులు కట్టేసి ఝామ్మని సైకిలేసుకుని వెళ్ళిపోయాడు స్వామికార్యతత్పరుడయిన రామానుజం.

మీటింగ్‌లోకు వెళ్ళబోతుండగా మళ్ళీ ఫోనువచ్చింది. "నాన్నా నేను కాలేజి నుండి నా ఫ్రెండ్ రంగనాయికితో తిన్నగా థియటరుకే వస్తున్నాను. అంచేత ఇంకో టిక్కెట్టు ఎక్కువ కొనమని చెప్పు. పబ్లిక్ బూతునుండి మాట్లాడుతున్నాను. ఇంకో అర్థరూపాయి కాసు కూడాలేదు. అంచేత నువ్వే ఫోను చేసి అమ్మను నాకోసం కాచుకోకుండా వచ్చేయమని చెప్పు..." అని చకచక పురమాయించేసి ఫోన్ పెట్టేసింది జ్యోతి.

'ఒకే ' అనుకున్నారు ఎమ్మెమ్. కాని ...

గొంతులో వెలక్కాయ పడ్డట్లయింది. ఈలోగా మీటింగ్ మీటింగని పి.ఏ ఊదరగొట్టేయడంతో అందులోకి వెళ్ళిపోయారు ఎమ్మెమ్.

మీటింగ్ అయ్యేసరికి ఐదూ అయింది. తన గదిలోకి అడుగుపెట్టిన మరునిముషం ఆ ఫోన్ పిలుపునందుకున్నారు ఎమ్మెమ్. రామానుజం.

"అయిదు టిక్కెట్లు కొనడం కష్టం అయింది కాని సార్ కొనేసాను.." అన్నాడు.

"రామానుజం...." అని జ్యోతి ఫోన్ చేసిన కబురుచెప్పి, ఇంకో టిక్కెట్టు కావాలి అన్నారు ఆయన. అస్సలు అవగింజంత అవకాశం కూడా లేదన్నాడు రామానుజం.

"అదేమిటయ్యా.. ఆ సంగీత ప్రధానమయిన సినిమాకు ఇంత రద్దీ ఏమిటి?"

"సంగీత భరితమా...? అని ఆశ్చర్య పోయాడు. రామానుజం.

"శంకరాభరణం" సినిమాలో మంచి పాటలున్నాయని అందరూ అంటున్నారు కదోయి.?"

"శంకరాభరణమా?" అని ఆశ్చర్యపడిపోయాడు రామానుజం.

ఎం.ఎం.రావుగారికి చాలా పెద్ద కారుమేఘంలాంటి డౌట్ వచ్చేసింది.... "చూడు రామూ నువ్వు కొన్న ఐదు టిక్కట్లు 'శ్రీరమణ' టాకీసులో ఆడుతున్న సినిమాకేనా?"

"ఔన్సార్ "

"అపుడు 'శంకరాభరణమే' కదా ఆడుతుంది?"

కాస్సార్ "ఆమె అయిదు రాత్రులు" అన్న మలయాళం డబ్బింగ్ సినిమా సార్?

రామానుజం ఎదుట వుంటే భయంకరమైన హత్యాకాండ జరిగిపోయివుండును. కాని ఆ దయగల ప్రభువు కరుణామయుడవటం మూలాన్న ఆ పాపం జరుగలేదు. వాటేన్ ఇన్సల్ట్! తను ఎం ఎం రావ్ ఒక పెద్దమనిషి. జెంటిల్మన్, కుటుంబంతో పాటు 'ఆమె అయిదు రాత్రులు'కు వెళతాననుకున్నాడు? మడ్డి ముండాకొడుకు... వాడికి మూడింక్రిమెంట్లన్నా కోసేయాల్సిందే... డప్పట్.

అయిదుంబావయింది...తమ ఇంటికని తానిందాక హడావిడిలో థియేటర్ పేరు మాత్రమే చెప్పిపంపడం పొరబాటయిందనుకొని, వెంటనే "శంకరాభరణం ఎక్కడ ఆడుతోంది" – అని అడిగాడు రావు.

"అది నిన్నటిదాకా ఇక్కడే ఆడింది. ఇవాళనుంచి రామా టాకీసులోకి మారింది. ఆ థియేటర్ ఇక్కడినుండి అర కిలోమీటర్ వెనుకే గనుక మీరేమీ .. గాబరా పడకండా రండి. . అక్కడ బుకింగ్‌లో నా క్లాస్‌మేటున్నాడు. ఇక్కడ అవి అమ్మేస్తాను." అని ఫోను పెట్టేసిన రామానుజం మీద రావుగారికి బోలెడంత జాలి కలిగింది.

పాపం.. ఇతగాడికి ఇంక్రిమెంట్స్ కట్ చేస్తే వచ్చే జన్మలో పాకిస్థాన్‌లాంటి దేశంలో పుట్టవలసి వస్తుంది... వద్దు వద్దు ఆ పని చేయకూడదు".... అనుకుంటుండగా ఎం. డి. గారే తిన్నగా తన గదిలోకి వచ్చేశాడు. ఏవో మినిట్స్ ఇవీ అవీ గత్తరజేసి ఆయన వెళ్ళేసరికి అయిదున్నరయి పోయింది.

ఆటోమీద 'శ్రీరామా' చేరేసరికి ఆరయింది. పది రూపాయల నోటిస్తే చిల్లరలేదని ఆటో వాడి పేచీ. కిల్లీకొట్టులో సిగరెట్టు పెట్టె కొనుక్కొని, ఆటోవాడికి డబ్బిచ్చి రొప్పుతూ రోజుతూ హాలులో చేరేసరికి ఆరూ పది.

అక్కడ నలుగురైదుగురు తప్ప జనం లేరు. బుకింగ్ విండో దగ్గర 'హౌస్‌ఫుల్' బోర్డుంది. రామానుజం పిల్లలు కాని వినయ కాని ఎవరూ లేరు.

అసలు ఇది శ్రీరామా టాకీసేనా సందేహం వచ్చి బయటికి వెళ్ళి ఆ భవనం పైకి చూశారాయన. ఆహా శ్రీరామాయే అందులో ఆడుతున్న శంకరాభరణమే!

మరి ఏమయింది? అందరూ కలిసి శ్రీరమణకు వెళ్ళిపోయి వుండిపోయారా. మన రామానుజం మాటేమిటి? ఒకవేళ అందరూవచ్చి సినిమా ప్రారంభం అవుతుందని లోపలికి వెళ్ళి పోయారేమో. అయితే కనీసం వినయ అయినా బయట వుండొద్దూ? బుర్ర వేడెక్కిపోయి చెమటలు పోస్తున్నాయి. ఎమ్మెమ్‌రావుకు.

ఒక కుర్రాడు వచ్చాడు.

"సార్ తమ పేరు ఎం.ఎం.రావుగారా?"

తల వూపారాయన.

"మీ అబ్బాయి రఘు నాచేతికిదిచ్చి మీకిమ్మన్నాడు సార్....." అని ఇచ్చాడు.

"వాళ్ళంతా ఏరీ...?

"వాళ్ళు ఎవరో నాకు తెలియదండీ."

"నేను మాట్నీ చూసి వెళ్తుంటే రఘు నాచేతి కిచ్చాడీటిక్కెట్లు. వాడు నా క్లాస్‌మేట్..వస్తాను సార్". అని అతడు వెళ్ళిపోయాడు.

తలుపు తోసుకుని, బరువైన తెర ముడతలను తొలగించుకుని లోపలికి అడుగు పెట్టారు ఎమ్మెమ్ రావు. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. వెండితెరమీద అక్షరాలు, ఏదో సంగీతం. సినిమా మొదలయినట్లుంది. అషరర్ టార్చి ఒక్కసారి వెల్గు, అటెటో చూపించి "ఆ వరసలో ఆరు" అని టార్చి ఆర్పేసి వెళ్ళిపోయాడు.

చీకటికి కాస్త సర్దుకుంటున్న కళ్ళు, ఒక్క క్షణం వెలిగి ఆరిన టార్చిలైటు వలన ఇంకా చీకట్లు కమ్ముతుండగా ఆ వరసలోకి దూరి ఒకరి పాదం తొక్కి "ఛీ బ్రూట్" అన్పించుకుని ఇంకొకసారి ఒళ్ళో కూచున్నంతపని చేసి ఉలిక్కిపడి, 'సినిమాకు ఆలస్యంగా వచ్చి అందరి ప్రాణాలు తీయడం ఎందుకో'- అని ఒక అజ్ఞాత గృహిణి యొక్క ఉపదేశం అందుకుని, సిట్‌డౌన్, సిట్‌డౌన్, ష్ అని ఇంకొకరి సినాదం స్వీకరించి, సీట్లోకి వెళ్ళి కూర్చున్న ఎం.ఎం.రావుగారికి 4000 మీటర్స్ పరుగు పందెంలో జాతీయ రికార్డు నెలకొల్పినట్లయింది.

కుడిఎడమల చూశాడు. ఊహూ తన వాళ్ళెవరూలేరు.

సినిమా మొదలయినట్లుంది. కాని అయన మనసంతా చిందరవందరగా వుంది. హఠాత్తుగా ముందరి వరసలో కుడివైపుగా సుందరంలా కన్పించాడు. పరికించి చూశాడు. ఔను. వాడే!

"సుందరం, సుందరం" రహస్యంగా అరిచాడు....

"ష్-ష్" అన్నారు ప్రేక్షకులు.

"సుందరమ్" ఆశార్తి. సుందరమే తిరిగి చూశాడు.

"నాన్నా వచ్చావా?" అని సుందరం అంటుండగానే

"ఇక్కడ ఈ తండ్రి కొడుకుల డైలాగులేమిటండీ. బయటికి వెళ్ళి మాట్లాడుకోకా.." అని కసిరాడొక ప్రేక్షక మహాశయుడు.

ఆపని చేశారు తండ్రికొడుకులు.

వాళ్ళు అవరసలో వొకరిద్దరి పాదాలు తొక్కుకుంటూ, దీవెనలందుకుంటూ ఎం.ఎం.రావ్ బయటికి వస్తుంటే "ఎవడయ్య ఈయన.. ఇప్పుడిప్పుడే దూరాడు. అప్పుడే మళ్ళి లేచి చంపుతున్నాడు." అని వొకరంటే "అతిమూత్ర వ్యాధి కాబోలు. కోప్పడకండి సార్". ఇంకొకడు జాలి వెళ్ళబుచ్చాడు.

ఇద్దరి పీకలూ కలిసి వొక్కసారిగా పిసకాలన్నంత బ్లడ్ ప్రెషర్ వచ్చేసిన రావుగారలాగే బయటికొచ్చారు.

రాగానే మీదపడిపోయినంత పని చేశాడు. సుందరం "బలేవాడివే నాన్నా? వెంకయ్య టిక్కట్లు తీసివుంచుతాడన్నావ్. వాడు కన్పించనే లేదే."

"వెంకయ్యకు బదులు రామానుజాన్ని పంపించానే".

"రామానుజమూ లేడు, మధ్వాచార్యులూ లేడు. నేను రఘు అప్పటికప్పుడు కలిసికొన్నాం నాల్గు టిక్కెట్లు "

"జ్యోతి"

"అది దాని స్నేహితురాలితో వచ్చింది. వాళ్ళిద్దరూ ఆడవాళ్ళ 'క్యూ'లో నిల్చోని తీసుకుని బాల్కనీకి వెళ్ళిపోయారు. నేను రఘు సినిమా ఆరంభం అయిపోతూంటే లోపలికి వెళ్ళాం. వెళ్ళేముందు రఘు ఫ్రెండు దివాకర్ కనబడితే ఓ పావుగంట చూసి, ఈ లోగా మీరొస్తే మీకిమ్మని చెప్పి వెళ్ళాం. వాడి చేతా ఆ రెండు టిక్కట్లు. ?

"రెండు టిక్కట్లా?"

"ఔను నాన్నా. నీకు అమ్మకు కలిపి రెండు టిక్కట్లు వుంచాము"

తలగిర్రున తిరిగిపోతుండగా, చొక్కాజేబులోంచి సగం చింపిన ముక్కలు తీసి చూశారు. నిజమే, రెండు సగాలున్నాయి. ఇందాక హడావిడిలో వొకటి అనుకుని · ఆ చీకటిలో రెండు ఇస్తే వాడు ఆ రెండూ చింపేసినట్లున్నాడు. .

"అయితే మరి అమ్మేది".

'అదేవిటి నాన్నా? జ్యోతి నీకు ఫోన్ చేసిందట కదా. అంచేత అమ్మ ఒంటరిగా ఇంత దూరం రాలేదేమోనని నువ్వింటికి వెళ్ళి ఉంటావు, ఇద్దరు కలిసి వస్తారేమో, అందుకే ఆలస్యం అయిందేమోనని మేము అనుకున్నాం. మరి అమ్మను తీసుకురాలేదా"?

ఉరుము, పిడుగు, తుఫాను, నాగుపాము, ఆటంబాంబు, ఎలుగుబంటు– అన్ని ఒక్కసారిగా అన్ని దిశలనుండి దాడిచేస్తే ఎలా వుంటుంది? అలా వుంది ఎమ్మెమ్ పరిస్థితి.

"ఔను.. జ్యోతి చెప్పింది. కాని తానింటికి ఫోన్ చేయలేదు. వినయ ఇంటిదగ్గరే వుండి పోయిందేమో....హన్నా.. ఇవాళ తన తెలుగు బి.ఏ. మీద పెద్ద ప్రైవేట్ క్లాసు

తథ్యం...రాకన్ మానవు హోని వృద్ధులు మహారణ్యంబులో డాగినన్ అన్న సూక్తితో వైరాగ్యం పొందిన ఎమ్మెమ్‌కు "ఓ.కే. నువ్వు, రఘు, జ్యోతి, జాగ్రత్తగా ఇంటికి వచ్చేయండి...గో ఇన్." అని చెప్పారు.."

సుందరం లోపలికి వెళ్ళాడు.

ఎమ్మెమ్ నెమ్మదిగా విషాదంగా, అడుగులు వేసుకుంటూ గేటువైపు వెళ్తుండగా థియేటర్లోనుండో, పక్కనకొట్టులో నుంచో– "సామజ వరగమనా" అన్న పాట మొదలయింది.

ఆటోలో ఇంటికి వెళ్ళేసరికి వినయలక్ష్మి లేదు.

"అదేవిట్రా అబ్బాయి. కోడలు సినిమా చూస్తానంటే ఇట్లా చేశావు?" అంది వాళ్ళమ్మ.

కోప్పడే ఓపికకూడా హరించిపోయిన ఎమ్మెమ్ "ఇంతకు ఏదీ ఇల్లాలు?"

"అమ్మాయి ఇంటికి వస్తానని రాలేదుట అంచేత అది కాస్తా కాలేజీదగ్గర వుండి పోయిందేమోనని దానికోసం కోడలు బయలుదేరి వెళ్ళి గంటయ్యింది. అక్కడినుండి ఇద్దరూ కలసి సినిమాకు వెళ్ళారో ఏమో" అందావిడ చాల తాపీగా. దర్శకుడు, కవి అయిన సదరు దామోదర్‌రావు రాసే హెవీ డైలాగుల్లాంటివి మనసులో మెదిలాయి – కానీ అవేమీ పల్కకుండా వీధిలోకి వెళ్ళబోయారు...ఎమ్మెమ్,

"కోడలు దోశెలు పోసి వుంచింది! రెండు తిని వెళ్ళరాదూ". అని ఆమె అంటుంటే ఏమ్మెమ్‌కు కళ్ళ నీళ్ళొచ్చినంత పనయింది. పళ్ళు గట్టిగా కొరుకుదామనుకున్నారు గాని . అమ్మో అరు వందల రూపాయలు పెట్టి కట్టించుకొని రెండు నెలలయినా కాలేదు – అని గుర్తుకొచ్చి ఆపని మానేశారు.

వీధిలోకి అడుగు పెడుతుండగా ఫోన్ మోగింది. ఆదుర్దాగా పరుగెత్తుకొచ్చి అందుకున్నారు.

"సార్ ఎం. ఎం. రావ్ గారేనా? ..మేము బంగారంపేట పోలీస్‌స్టేషన్‌నుంచి మాట్లాడుతున్నాం సార్"

"ఎస్. ఎస్. ఏమయింది?"

"ఇందాక శ్రీరమణ థియేటరు దగ్గర సినిమా టిక్కట్లు బ్లాకులో అమ్ముతుంటే మావాళ్ళు వొకతన్ని పట్టుకున్నారు సార్. పేరు....రామానుజమట.. ఇక్కడ లాకప్‌లో ఉన్నాడండీ...... మీ పేరు చెబుతున్నాడండీ....."

"మై గా డ్......నేనక్కడికి ఐదు నిమిషాల్లో వస్తున్నా," అని ఫోన్ పడేసి వీధిలోకి పరిగెత్తాడు ఎమ్మెమ్ రావుగారు.

"ఎదర బతుకంతా చిందర వందరా" అని టీకొట్టులో రికార్డు వికృతంగా అరుస్తోంది.

*('జ్యోతి', దీపావళి సంచిక '82)*